క్లుప్తంగా

త్వరలో విశాఖపట్నంలో ఆర్బీఐ కార్యాలయం

అధికారుల బృందం నర్సరీ సందర్శన



ఆర్బీఐ అధికారులకు స్వాగతం పలుకుతున్న నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు

కడియం: విశాఖపట్నంలో త్వరలోనే ఆర్బీఐ కార్యాలయం ప్రారంభమవుతుందని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారుల బృందం వెల్లడించింది. కడియపులంకలోని పుల్లా ఆంజనేయులుకు చెందిన శ్రీసత్యదేవ నర్సరీని శనివారం ఈ బృందం సందర్శించింది. ఈ బృందంలో రీజనల్ డైరెక్టర్ బషీర్, సభ్యులు అనుజ్ రాజన్, అనతి, మేఘనసింగ్, ప్రసాద్, కృష్ణయ్య ఉన్నారు. వీరికి నర్సరీ రైతులు ఘన స్వాగతం పలికి, వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. స్వశక్తితో నర్సరీ రంగాన్ని ఇంతగా అభివృద్ధి చేసిన కడియం ప్రాంత రైతాంగానికి బ్యాంకుల సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆర్బీఐ అధికారులు తెలిపారు. నర్సరీ రైతులు రాజశేఖర్, వీరబాబు తదితరులు ఉన్నారు.

శేషుకుమారికి రైతు నేస్తం మిద్దెతోట పురస్కారం



యర్రా శేషుకుమారి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరానికి చెందిన టెర్రస్ గార్డెన్ నిర్వాహకురాలు యర్రా శేషుకుమారికి రఘోత్తమరెడ్డి రైతు నేస్తం మిద్దె తోట పురస్కారానికి ఎంపికైనట్టు రైతునేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల ఏడున ఉదయం పది గంటలకు హైదరాబాద్ రెడ్‌హిల్స్‌లోని ఫ్యాప్సీ భవన్‌లో జరిగే కార్యక్రమంలో శేషుకుమారి ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

నేడు చాగంటి భక్తిసుధ కార్యక్రమం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): డాక్టర్ గరికిపాటి రాజారావు కళావేదిక, డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్య మైదానంలో శారదా జ్ఞాన పుత్ర, ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు భక్తి–పూజ అనే అంశంపై భక్తిసుధ ప్రవచన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కొత్త బాలమురళి ఒక ప్రకటనలో తెలిపారు. సుబ్రహ్మణ్య మైదానంలోని నూతన వేదికపై ఈ ప్రవచన కార్యక్రమం ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు.

24న తూర్పు బ్రాహ్మణ శంఖారావం

సీటీఆర్ఐ: రానున్న ఎన్నికల సందర్భంగా బ్రాహ్మణ ఓటర్ల ఉనికిని చాటేందుకు మార్చి 24న తూర్పు బ్రాహ్మణ శంఖారావం నిర్వహిస్తున్నట్టు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు దుర్వాసుల సత్యనారాయణ వెల్లడించారు. శనివారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అన్ని పార్టీలకు చెందిన బ్రాహ్మణ నాయకులు, బ్రాహ్మణులతో ఈ శంఖారావం జరుగుతుందన్నారు. త్వరలోనే వేదిక ప్రకటిస్తామని తెలిపారు. బ్రాహ్మణులకు సరైన అవకాశాలు ఇచ్చే వారిని ఈసారి గెలిపించాలని పిలుపు ఇస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసు, బ్రాహ్మణ యువజన నాయకులు మల్లాది ఉదయరాణా, అయ్యల సోమయాజుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే జక్కంపూడి పరామర్శ



కొత్తపల్లి కిట్టయ్య చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న జక్కంపూడి రాజా, పార్టీ నాయకులు

కడియం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శనివారం మండలంలో పలువురిని పరామర్శించారు. బుర్రిలంకకు చెందిన ప్రముఖ నర్సరీ రైతు కొత్తపల్లి కిట్టయ్య మృతికి రాజా సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే సతీవియోగంతో బాధపడుతున్న శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్రను జక్కంపూడి రాజా పరామర్శించారు. పొట్టిలంకలోని నాగేంద్ర ఇంటి వద్ద ఆయన్ను కలిసి సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

మండల పరిషత్ ఏఓగా సుబ్బారావు

కడియం: కడియం మండల పరిషత్ పరిపాలనాధికారి (ఏఓ)గా పీవీ సుబ్బారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసే చంద్రరావు అక్కడకు బదిలీపై వెళ్లారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఈ బదిలీలు అయ్యాయి.

మీ వాడిని.. ఆదరించండి

- మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ
- రూ.5.10 కోట్లతో డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



ధవళేశ్వరం లక్ష్మీజనార్దనస్వామి కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేణు

ధవళేశ్వరం: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ప్రజలు ఆదరించి, ఆశీర్వదించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే, ప్రజలకు సేవకుడిగా ఉంటానని స్పష్టం చేశారు. శనివారం ధవళేశ్వరంలో మంత్రి వేణుగోపాలకృష్ణ స్థానిక నాయకులు అధికారులతో కలిసి రూ.5.10 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ బాధ్యత మరిచిన వ్యక్తులు పాలకులైతే ప్రజలకు కష్టాలే మిగులుతాయని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. ఎవరికి, ఎటువంటి సమస్యలున్నా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ధవళేశ్వరం మెయిన్ రోడ్డు ప్రాంతం డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక, దుర్గంధభరితంగా ఉండేదన్నారు. డ్రైనేజీల్లో మెరుగైన శానిటేషన్ చేయించినట్టు చెప్పారు.

అన్ని సమస్యలకూ పరిష్కారం

అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.5.10 కోట్లతో రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు వంటి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టామని మంత్రి వేణుగోపాలకృష్ణ వివరించారు. ధవళేశ్వరం ప్రజలకు గోదావరి పక్కనే ఉన్నప్పటికీ, నది నీరు అందించేందుకు గత పాలకులు నిర్లక్ష్యం చేశారని తెలిపారు. తన పర్యటనలో ఆయా వాస్తవాలను గ్రహించి, తాగునీటికి అవసరమైన సంపును రూ.40 లక్షలతో మంజూరు చేయించానన్నారు. ప్రస్తుతం ఉన్న రక్షిత మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకుకు అదనంగా మరొకటి నిర్మించేలా అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమం

గత పాలకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల అభివృద్ధికి నిర్లక్ష్యం చేస్తే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆయా వర్గాల ప్రజల సంక్షేమాభివృద్ధిని కాంక్షిస్తూ, డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారులు ఖాతాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాన్ని దేశంలోనే ఎక్కడా లేని విధంగా అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా రాజబాబు, తలారి వరప్రసాద్, సాధనాల చంద్రశేఖర్(శివ), షట్టర్ బాషా, గోలి దేవకుమార్, ఎస్‌వీ శేఖర్, పెన్నాడ జయప్రసాద్, పుట్టా పరేష్‌నాథ్, పందెళ్ల భానుప్రసాద్, ఒంటెద్దు కృష్ణ, చాటకాల చంటి, మిరప రమేష్, గునిపే అశోక్, బర్రి కామేశ్వరరావు, హమీద్ బాషా, ముత్యాల జాన్, రేగుళ్ల రాజు, కొత్తపల్లి శివ, పట్టపగలు వెంకటలక్ష్మి, దేవులపల్లి సరితారాణి, పసుపులేటి దేవి, పేరాబత్తుల శ్రీదేవి, దాసరి ధర్మ, మద్దాల బాబి, పౌరోజు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు ప్రశంసనీయం

అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సేవలు ప్రశంసనీయమని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ హాల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పేదరికంలో పుట్టిన బిడ్డ ఉన్నత చదువులను అభ్యసించే దిశగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అత్యంత ప్రోత్సాహాన్ని అందిస్తున్నారన్నారు. అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించారన్నారు. పేదరికంలో ఉన్న పిల్లల ఉన్నత చదువులే లక్ష్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా కానుక, జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన, విదేశీ విద్యా విధానాన్ని అందిస్తున్నారన్నారు. పార్టీ నాయకులు నక్కా రాజబాబు, తలారి వరప్రసాద్, పెయ్యల రాజేష్, గూటం రాజు, పేట రామకృష్ణ పాల్గొన్నారు.

ఒంటెద్దు దేవికి మంత్రి వేణు పరామర్శ



దేవిని పరామర్శిస్తున్న మంత్రి వేణు తదితరులు

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ నాయకుడు ఒంటెద్దు కృష్ణ సతీమణి, మండల మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు ఒంటెద్దు దేవిని శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. ఇటీవల ఒంటెద్దు దేవికి శస్త్రచికిత్స జరగ్గా, ఆమె ఎర్రకొండలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి వేణుగోపాలకృష్ణ వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట పార్టీ నాయకులు నక్కా రాజబాబు, పెన్నాడ జయప్రసాద్, గోలి దేవకుమార్, పుట్టా పరేష్‌నాథ్, పందెళ్ల భానుప్రసాద్, దేవులపల్లి సరితారాణి, పసుపులేటి దేవి, ముత్యాల జాన్ తదితరులున్నారు.

మనోధైర్యాన్ని కోల్పోరాదు

కడియం: విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోను మనోధైర్యం కోల్పోరాదని కడియం సీఐ బి.తులసీధర్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సీఐ మాట్లాడుతూ ఏదైనా సమస్య వస్తే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేసి పరిష్కారం వెతకాలన్నారు. క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోరాదని చెప్పారు.

ప్రజా చైతన్యం స్టిక్ మనోహర్ సొంతం

మనీ మేజిక్ పుస్తకావిష్కరణలో మంత్రి వేణు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ, చిత్రంలో స్టిక్ మనోహర్, సత్యానందం తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇంద్రజాల రంగంలో నిష్ణాతుడైన డా.ఎస్ మనోహర్‌రావు (స్టిక్ మనోహర్) ప్రజలను చైతన్యవంతులను చేయడంలో, మూఢ నమ్మకాల నిర్మూలనలో చేస్తున్న కృషి నిరుపమానమైనదని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అభినందించారు. శనివారం ఉదయం స్థానిక ఏవీఏ రోడ్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో స్టిక్ మనోహర్ రచించిన మనీ మేజిక్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. పుస్తక తొలి ప్రతిని విశ్రాంత అడిషనల్ ఎస్పీ ఆర్.సత్యానందంకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ మనోహర్ పోలీస్ శాఖలో ఎస్సైగా చేరి, అడిషనల్ ఎస్పీగా బాధ్యతలను నిర్వర్తించారని చెప్పారు. మ్యాజిక్ రంగంలో మనోహర్ అంచెలంచెలుగా ఎదిగి.. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించడంతో పాటు, పీహెచ్‌డీ చేయడం ముదావహమన్నారు. గతంలో అగ్గిపుల్లలతో మేజిక్ పుస్తకం ద్వారా ఇంద్రజాలాన్ని ప్రతిఒక్కరికీ అందుబాటులోకి తెచ్చిన మనోహర్.. తాజాగా మనీ మ్యాజిక్ పుస్తకాన్ని తీసుకురావడం శుభపరిణామమన్నారు. డాక్టర్ ఎస్ మనోహరరావు మాట్లాడుతూ అగ్గిపుల్లలతో మేజిక్ పుస్తకం స్ఫూర్తితో, ఇంద్రజాలంలో ప్రత్యేకాంశాలను రాయాలనే ఉద్దేశంతో కరెన్సీ నోట్లు, నాణేలతో కూడిన 52 మేజిక్ అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచినట్టు వివరించారు. ఈ పుస్తకాన్ని తన సోదరుడు ఎస్.సత్యభాస్కరరావు, భూదేవికి అంకితం ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోహర్ సతీమణి సోమేశ్వరీదేవి, కుమార్తె పుష్పమి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి గెలిపించండి

- ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో–ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్
- రూ.2 కోట్లతో సీసీ రోడ్లకు శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మార్గాని భరత్

రాజమహేంద్రవరం సిటీ: నగరాభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నానని, నగరంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో–ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ ప్రజలను అభ్యర్థించారు. శనివారం నగరంలోని 25వ డివిజన్‌లో పాత అన్నపూర్ణ థియేటర్ వద్ద రూ.2 కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులతో సుమారు ఒకటిన్నర కి.మీ. మేర సీసీ రోడ్లను వివిధ వార్డుల్లో నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఆయా పనులు యుద్ధప్రాతిపదికన 15 రోజుల్లో పూర్తవుతాయన్నారు. ఈ ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు సీసీ రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని కోరుతున్నానన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎంత మాత్రం అభివృద్ధి జరగలేదని, కేవలం వారి స్వలాభం కోసమే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్న ఒకటిన్నర దశాబ్దాల్లో నగరంలో ఏం అభివృద్ధి చేశారో టీడీపీ నేతలు ఆదిరెడ్డి అప్పారావు కుటుంబ సభ్యులు నగర ప్రజలకు చెప్పాలన్నారు.

బహిరంగ చర్చకు సవాలు

తాను ఎంపీ అయ్యాక నగర రూపురేఖలు సమూలంగా మార్చి వేసినట్టు ఎంపీ భరత్‌రామ్ పేర్కొన్నారు. నగరంలో జరిగినంత అభివృద్ధి రాష్ట్రంలో మరెక్కడా జరిగి ఉండదన్నారు. రూ.400 కోట్లతో కేవలం రెండేళ్ల కాలంలో ఇంత పెద్దఎత్తున అభివృద్ధి చేస్తే, దీనిని చూసి సహించలేక టీడీపీ నేతలు విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. జీఓలు, పరిపాలన మంజూర్లు తెచ్చామని చెబుతున్నారని, అవి దేనికీ ఉపయోగపడవని ఎద్దేవా చేశారు. టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధిపై, ఎంపీగా తాను చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని ఎంపీ భరత్ రామ్ సవాలు విసిరారు. తమ కష్టార్జితాన్ని దారికాచి బ్లేడ్ బ్యాచ్ దోచుకుంటోందని, తమకు రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా నగరంలోని రంభ, ఊర్వశి, మేనక థియేటర్ల సమీపంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ జట్టు కూలీలు ఎంపీ భరత్‌రామ్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రశాంతతకు మారుపేరైన రాజమహేంద్రవరంలో బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్లను పెంచిపోషించేది రాజకీయ నాయకులేనని, వారి అండ లేకుంటే ఇలా పేట్రేగేవారు కాదని ఎంపీ అన్నారు. పచ్చబొట్ల కల్చర్ తీసుకొచ్చింది ఆ సోకాల్డ్ లీడర్లేనన్నారు. ఇటువంటి సంఘ విద్రోహ శక్తులను ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, 24వ వార్డు ఇన్‌చార్జి అరవ సురేష్‌కుమార్, మాజీ కార్పొరేటర్ బెజవాడ రాజ్‌కుమార్, నీలపాల తమ్మారావు, అడపా రఘు, వలవల దుర్గా ప్రసాద్(చిన్ని), రొక్కం త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో యువత భాగస్వాములు కావాలి

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.నాయక్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డా.శ్యామరాజ్ నాయక్

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో యువత భాగస్వాములు కావాలని, ఓటు వేసేలా యువ ఓటర్లు ప్రజలను ప్రోత్సహించాలని కాతేరులోని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చవాన్ శ్యామరాజ్ నాయక్ అన్నారు. నా తొలి ఓటు దేశానికే ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాలలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఎన్నికల ప్రాముఖ్యాన్ని, దేశ భవిష్యత్తు కోసం ఓటు వేసే ప్రాధాన్యాన్ని వివరించారు. దేశ యువత తమ గళాన్ని వినిపించాలని, తొలిసారిగా ఓటు వేసే యువ ఓటర్లు తమ ఓటు హక్కును పెద్దఎత్తున వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ఎస్‌ఎస్‌ఎస్ అధికారులు డా.పి.అమ్మాజీ, డా.జి.రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లైబ్రరీలో రికార్డు అసిస్టెంట్ ఆత్మహత్య

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆర్థిక ఇబ్బందులతో స్థానిక మంగళవారపుపేటలోని శ్రీగరిమెళ్ల ప్రభుత్వ అత్యున్నత విద్యాధ్యయన సంస్థలోని లైబ్రరీలో రికార్డు అసిస్టెంట్ నందిస్వామినాథం (58) శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం, కంబాలపేటకు చెందిన స్వామినాథం అదే సంస్థలోని లైబ్రరీలో మూడేళ్ల నుంచి రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అదే సంస్థలో పనిచేసే అనంతం వెంకటకుమార్ రూ.50వేలను వినోద్, రమణ అనే వ్యక్తుల వద్ద అప్పుగా తీసుకున్నాడు. దీనికి స్వామినాథం ష్యూరిటీగా ఉన్నాడు. అప్పులు బాధ తాళలేక 2020లో వెంకటకుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో బాకీ సొమ్ము కోసం వినోద్, రమణలు.. స్వామినాథంపై ఒత్తిడి తెచ్చి, కోర్టును ఆశ్రయించారు. దీంతో స్వామినాథం జీతం నుంచి ప్రతినెలా అప్పు కింద జమ కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు మొదలయ్యాయి. దీనిని తట్టుకోలేక శనివారం ఉదయం లైబ్రరీలో గుమ్మానికి స్వామినాథం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ ఎస్సై ఆదినారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛను అందజేత



హాస్పిటల్‌లో కేతా రమణకు దివ్యాంగ పింఛను అందజేస్తున్న వలంటీర్ సత్యకుమారి



కేన్సర్ హాస్పిటల్‌లో ఈసరపు లక్ష్మికి వితంతు పింఛను అందజేస్తున్న వలంటీర్ లక్ష్మి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): లబ్ధిదారులు ఎక్కడున్నా వారికి పింఛను సొమ్ము అందించడమే వలంటీర్ల లక్ష్యం. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని 27వ డివిజన్ ఇన్నీసుపేటకు చెందిన దివ్యాంగుడు కేతా రమణ ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో అత్యవసర చికిత్స పొందుతున్నాడు. దీంతో 38వ వార్డు సచివాలయ వలంటీర్ సత్యకుమారి శనివారం అక్కడకు వెళ్లి పింఛనును అందజేసింది. అదేవిధంగా ఇన్నీసుపేటకు చెందిన వితంతు పింఛను లబ్ధిదారు ఈసరపు లక్ష్మి స్థానిక కేన్సర్ హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స పొందుతోంది. ఆమెకు 38వ వార్డు సచివాలయ వలంటీర్ లక్ష్మి పింఛను సొమ్ము అందజేశారు.

కిక్ బాక్సింగ్‌లో సాయికృష్ణ ప్రతిభ



సాయికృష్ణను అభినందిస్తున్న టీకే

ప్రకాశంనగర్: కిక్ బాక్సింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌కు రాజమహేంద్రవరానికి చెందిన పి.సాయికృష్ణ ఎంపికయ్యాడు. గత నెల ఆరు నుంచి న్యూఢిల్లీలో జరిగిన వాకో ఇండియా ఓపెన్ ఇంటర్నేషనల్ సబ్ జూనియర్స్ కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించి, వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఇతడు రాజమహేంద్రి స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి సాయికృష్ణను అభినందించారు. కోచ్ సామ్యూల్, విద్యార్థి తల్లిదండ్రులు పి.శ్రీనివాసరావు, సత్యకళ పాల్గొన్నారు.

400 మంది పేదలకు అన్నదానం



దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

ప్రకాశం నగర్: శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా దొరబాబు యువసేన, జిల్లా బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సైన్యం సభ్యులు శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్వర్ణాంధ్ర సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక పుష్కర్‌ఘాట్ వద్ద సుమారు 400 మంది పేదలకు అన్నదానం చేశారు. ప్రముఖ డాక్టర్ సత్తి గౌతమ్‌రెడ్డి, జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. స్థానిక ఇన్నీస్‌పేటలోని జియాన్ అంధుల పాఠశాలలో దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. సంజీవని బ్లడ్ బ్యాంక్‌లో తిరుమలశెట్టి వాసు రక్తదానం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అల్లూరి సీతారామరాజు యువజన సంఘం అధ్యక్షుడు తేతలి పవన్‌కుమార్ రెడ్డి, చిన్నారెడ్డి, తమ్మినేని కిషోర్, జన్ని సతీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు రోలర్ స్కేటింగ్ పోటీలు

ప్రకాశంనగర్: రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌ను ఈ నెల 3న ఉదయం 6 నుంచి జరగనున్నాయి. వివరాలను రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులకు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు పాల్గొనవచ్చని, అండర్–5, 7, 9, 11, 14 విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

ఇంటి స్థలం హక్కు పత్రాల పంపిణీ



భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్, సర్పంచ్

కడియం: జేగురుపాడులో ఇంటి స్థలాల లబ్ధిదారులకు రిజిస్టర్డ్ కన్వేయన్స్ డీడ్స్ (సర్వ హక్కులతో భూ పంపిణీ) పత్రాలను శనివారం పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ బి.రమాదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీఎత్తున ఇళ్ల స్థలాలు పంపిణీ చేసినది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనన్నారు. తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ గతంలో పంపిణీ చేసిన ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి, ఇప్పుడు జేగురుపాడు గ్రామానికి చెందిన 261 మంది మహిళా లబ్ధిదారులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి వీరశివాజీ, సచివాలయ కన్వీనర్ పుట్టా బుజ్జి, వీఆర్వోలు సీహెచ్ ఆదినారాయణ, డి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకంపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: పీఎం విశ్వకర్మ పథకం ద్వారా చేతివృత్తుల వారికి రాయితీపై రుణాలు మంజూరు చేయనున్నామని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం పీడీ ఎన్‌వీఎస్ మూర్తి అన్నారు. శనివారం స్థానిక ఎస్‌వీజీ మార్కెట్‌లోని ఆర్ కన్వెన్షన్‌లో అవగాహన కార్యక్రమం జరిగింది. ఏపీఎస్‌ఎస్ డీసీ అధికారి ఏఎస్‌ఆర్ మూర్తి పథకం ప్రాముఖ్యతను వివరించారు. జిల్లా మేనేజర్ ఆదిత్య, ఏడీ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఫిలాటలీ అభిరుచిని పెంపొందించుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ: విద్యార్థులు ఫిలాటలీ అభిరుచిని పెంపొందించుకోవాలని రాజమహేంద్రవరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ అన్నారు. శనివారం పోస్టల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన ద్వారా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామన్నారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలిచిన శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థిని జి.సన్నితకు ప్రశంసా పత్రం, రూ.6 వేల స్కాలర్‌షిప్ అందచేశారు.